పద్మవ్యూహంలా ట్రాఫిక్!

- రోడ్లపై వ్యాపారాలు సాగిస్తున్న వైనం
- ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్
- ప్రధాన రహదారిలో ఇబ్బందిగా మారిన రాకపోకలు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ బాస్టాండ్‌లో ట్రాఫిక్ సమస్య పద్మవ్యూహాన్ని తలపిస్తుంది. మండలంలో మొత్తం 21 గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల నుంచి ప్రజలు నిత్యం మండల కేంద్రం సి.బెళగల్‌కు వస్తుంటారు. అయితే ప్రధాన రహదారి అయిన జెడ్పీ హైస్కూల్ నుంచి మండల కాంప్లెక్స్, బస్టాండ్‌ల మీదుగా పలుకుదొడ్డి గ్రామ క్రాస్‌రోడ్డు వరకు నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక బస్టాండ్‌లో మరీ రద్దీగా ఉండడంతో రాకపోకలకు బాటసారులు, వాహనచోదకు పడరానిపాట్లు పడుతుంటారు. బస్టాండ్ పరిసరాలలో రోడ్లపైనే వ్యాపారాలు సాగిస్తుండడం, ఆటోలు, ద్విచక్రవాహనాలు రోడ్డుపైనా పార్కింగ్ చేస్తుండడంతో జనంతో ఆ ప్రాంతం సంతను తలపిస్తుంది. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో సమస్య మరింత జఠిలంగా మారింది. ఇక ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ పద్మవ్యూహంలా మారుతుంది. ఎద్దుల బండ్లు, వాహనాలు, కూలీలతో ట్రాఫిక్ సమస్యలు చెప్పలేనివి కాదు. వీరు నిత్యం ప్రమాదం అంచున రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇష్టారాజ్యంగా ఆటోల పార్కింగ్

మండలానికి వివిధ గ్రామాల నుంచి రోజు వందకుపైగా ఆటోలు వస్తుంటాయి. అయితే చాలా గ్రామాలకు చెందిన ఆటోలకు పార్కింగ్ స్థలం లేక పోవడంతో రోడ్లపైనే వాటిని నిలిపేస్తున్నారు. ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు వచ్చినప్పుడు ట్రాఫిక్ స్తంభిస్తుంది. ఉదయం, సాయంత్రం ప్రజలు, విద్యార్థులు బస్టాండ్ దాటాలంటే ప్రమాదంతో పోరాటం చేసినట్లు ఉంటుంది పరిస్థితి.



సి.బెళగల్‌లో అడ్డదిడ్డంగా వాహనాల రాకపోకలు సాగిస్తున్న దృశ్యం



రోడ్లపైనే ఆటోలను ఇష్టానుసారంగా పార్కింగ్

రోడ్లపైనే వ్యాపారాలు

కొంతమంది బండ్లపై పండ్లు, పూలు, మరికొందరు ఆటోలలో కూరగాయల వ్యాపారాలు సైతం రోడ్డుపైనే సాగిస్తున్నారు. వ్యాపారస్తులతోపాటు కొందరు ద్విచక్ర వాహనాలు నిలిపేయడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. మరి కొందరు బీడీ బంకులు, చిరుతిళ్ల బంకులను రోడ్డుపైనే ఏర్పాటు చేసుకున్నా అధికార యంత్రాంగం మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కిలోమీటర్ ప్రయాణానికి పావుగంట కేటాయించాల్సిందే...

పద్మవ్యూహం లాంటి ట్రాఫిక్‌ను బస్టాండ్ నుంచి దాటుకుని వెళ్లాలంటే ప్రజలు సహస ప్రయాణం చేసినట్లు ఉంటుంది. ప్రధాన రహదారి అయిన జెడ్పీ హైస్కూల్ నుంచి బస్టాండ్‌ల మీదుగా పలుకుదొడ్డి గ్రామ క్రాస్‌రోడ్డు వరకు ఉన్న ఒక్క కిలోమీటర్ దూరాన్ని దాటుకుని వెళ్లేందుకు వాహనచోదకులకు దాదాపు 15 నిమిషాల పడుతుందంటే ట్రాఫిక్ సమస్య ఎలా ఉంటుందో అర్థం అవుతుంది.

ఉదయం బస్టాండ్ నుంచి వెళ్లలేని పరిస్థితి



సి.బెళగల్‌లోని జెడ్పీ హైస్కూల్ నుంచి పలుకుదొడ్డి గ్రామానికి వెళ్లే అడ్డదారి వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం బస్టాండ్ నుంచి పిల్లలు, వృద్ధులు వెళ్లలేని పరిస్థితి. విద్యార్థులకు ప్రతిరోజు రెండు పూటలు బస్టాండ్ దాటేందుకు ఓ విధమైన యుద్ధమే చేయాల్సి వస్తుంది. అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి.
– అరుణ్‌కుమార్, సి.బెళగల్

అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి



మండల కేంద్రం సి.బెళగల్‌లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. సి.బెళగల్‌కు వస్తే ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడాల్సిందే. ట్రాఫిక్ సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. వాహనచోదుకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అడ్డగోలుగా వాహనాలు రోడ్డుపైనే నిలుపుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.
– లోకేష్, గొల్లలదొడ్డి గ్రామం

ప్రతిఒక్కరూ ఆలోచించాల్సిన సమస్య



ట్రాఫిక్ సమస్య అనేది ప్రతిఒక్కరూ ఆలోచించాల్సిన విషయం. ఒక్క పోలీసులతో సాధ్యం కాదు. ప్రతి పౌరుడు బాధ్యతగా ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా వ్యవహరించాల్సి ఉంది. ఆ దిశగా ప్రజలను చైతన్న పరుస్తున్నాం. బస్టాండ్‌లో విధులు నిర్వర్తించేందుకు పోలీసులను నియమిస్తున్నాం. ఆటో స్టాండ్‌లను ఏర్పాటు చేశాం. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
– తిమ్మారెడ్డి, సి.బెళగల్ ఎస్ఐ

క్లుప్తంగా

పశు వైద్యశాలను తనిఖీ చేసిన డీడీ



పశువైద్యశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డీడీ దుర్గా ప్రసన్న బాబు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్లోని పశు వైద్యశాలను డీడీ ప్రసన్నబాబు తనిఖీ చేశారు. రికార్డులను, కార్యాలయ పరిసరాలను పరిశీలించారు. పశువులు, పాడి రైతులు, టీకాలు, మందుల సరఫరా, వినియోగం తదితర విషయాలను స్థానిక పశువైద్యుడు ప్రవీణ్‌కుమార్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో గాలికుంటు, బ్రూసెల్లా టీకాల కార్యక్రమం జరుగుతుందన్నారు. పాడి రైతులు ఉచిత టీకాలను, గోలకులం షెడ్ల నిర్మాణాలను, పశు బీమా, పశు కిసాన్ క్రెడిట్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా వచ్చేనెల ఒకటవ తేదీ నుంచి అఖిల భారత పశుగణన చేపట్టనున్నట్లు డీడీ తెలిపారు.

రేపు గ్రామ సభలు

కోడుమూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనుల గుర్తింపునకు ఈనెల 23న మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. సర్పంచ్ అధ్యక్షతన జరిగే ఈ గ్రామ సభల్లో ప్రజలు పాల్గొని గ్రామంలో 2024–25ఆర్థిక సవత్సరానికి గాను ఉపాధి పథకం కింద చేపట్టబోయే పనులను గుర్తించాలన్నారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఈ సభలను అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించాలని ఎంపీడీఓ ఆదేశించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: హౌసింగ్ కాలనీలలో వివిధ నిర్మాణ దశలలో ఉన్న గృహ నిర్మాణాలను లబ్ధిదారులతో వేగవంతం చేయించాలని ఎంపీడీఓ రాముడు అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం హౌసింగ్ ఏఈ సుమంత్, ఉపాధి హామీ ఈసీ పృధ్వీరాజ్‌తో గృహ నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలలోని హౌసింగ్ కాలనీ లేవుట్లలో, లబ్ధిదారులు వారి సొంత స్థలాల్లో నిర్మించుకుంటున్న గృహ నిర్మాణాలు మూడు నెలలోగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ఉపాధి పథకంలో భాగంగా చేపట్టిన పనిదినాలను వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఈసీకి సూచించారు.

నాలుగు రోజులకు లభ్యమైన మృతదేహం

పాణ్యం: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో ఈనెల 18వ తేదిన కుందులో గల్లంతైన ఎం. వెంకటేశ్వర్లు నాలుగు రోజుల తర్వాత బుధవారం శవమై తేలాడు. పోలీసుల వివరాల మేరకు గ్రామానికి చెందిన ఎం. వెంకటేశ్వర్లు 18న కుందూనదిలో ప్రమాదవశాత్తు జారీ పడి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు, గజ ఈతగాళ్లు నాలుగు రోజులుగా వెంకటేశ్వర్లు కోసం గాలిస్తునే ఉన్నారు. బుధవారం కడప జిల్లా పెద్ద ముడియం మండలం నిమ్మలదిన్నె గ్రామం వద్ద ఉన్న బ్రిడ్జికి అడ్డుపడడంతో గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పాణ్యం పోలీసులు అక్కడి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి వెంకటేశ్వర్లుగా నిర్ధారించారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హిందుమతి

పాణ్యం: మహిళలు ఆరోగ్య సూత్రాలు పాటించాలని శాంతిరామ్ ఆసుపత్రి ప్రొఫెసర్ హిందుమతి సూచించారు. బుధవారం ఆర్జీం ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా సాధికారతా ఆధ్వర్యంలో ఋతుచక్రం- శుభ్రంపై అంశంపై ఆమె అవగాహన కల్పించారు. ఆ సమయంలో మహిళల ఆరోగ్య పరిస్థితులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రొఫెసర్ వివరించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత సెల్ కో–ఆర్డినేటర్ హరిత పాల్గొన్నారు.

నేడు మొక్కలు నాటే కార్యక్రమం

సి.బెళగల్: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమంను చేపడుతున్నామని ఉపాధి హామీ పథకం ఏపీఓ లక్ష్మన్న, ఈసీ పృధ్వీరాజ్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ అమ్మకు ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో 4,100 మొక్కలను నాటడం జరుగుతుందన్నారు. మొక్కలు నాటేందుకు ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, శ్మశాన వాటికలు, ప్రభుత్వ కార్యాలయాలను ఎంపిక చేశామన్నారు. ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొనాలని వారు కోరారు.

సోలార్ పరిశ్రమను సందర్శించిన ఇంజినీరింగ్ విద్యార్థులు



సోలార్ పరిశ్రమను పరిశీలిస్తున్న విద్యార్థులు

పాణ్యం: పాములపాడు మండలం మిట్టకందనాలలోని సోలార్ పరిశ్రమను బుధవారం శాంతిరామ్ ఇంజినీరింగ్ విద్యార్థులు సందర్శించారు. సోలార్ ఎనర్జీ ఎలా ఉత్పత్తి అవుతుంది, ఎలా సరఫరా చేస్తారు, ఉత్పత్తి కావాల్సిన పరికరాలు తదితర విషయాలను పరిశ్రమ ఉద్యోగులు విద్యార్థులకు వివరించారు. పరిశ్రమలపై విద్యార్థులు అవగాహన కల్పిస్తున్నామని శాంతిరామ్ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

పోలీసు బందోబస్త్



పాణ్యం నాలుగురోడ్లు కూడలిలో బందోబస్త్ నిర్వహిస్తున్న పోలీసులు

పాణ్యం: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనకు నిరసనగా దేశ వ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యలో బుధవారం పోలీసులు బందోబస్త్ పడక్బందీగా నిర్వహించారు. పోలీసులు ఉదయాన్నే పాణ్యంలో నాలుగురోడ్ల కూడలిలో బంబదోబస్త్ చేపట్టారు. సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఉదయాన్నే బస్టాండ్, ప్రధాన వీధులు, జాతీయ రహదారిని పరిశీలించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు వారు తెలిపారు.

టమాట, మిరప పంటల్లో జాగ్రత్తలు తీసుకోండి

- జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసినందున ఉద్యాన పంటల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పంటను కాపాడుకోవచ్చని జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు తెలిపారు. ప్రధానంగా టమాట. మిర్చి పంటల్లో వర్షాలు పడిన నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. టమాటలో వర్షాల వల్ల పడిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు దగ్గర మట్టిని ఎగదోయాలి. యూరియా 2 గ్రాములు, 13–0–45 ఐదు గ్రాములు లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు. పంటకు ఆకుమచ్చ, కాయకుళ్లు, బూజు తెగుళ్ల ఉధృతి ఉంటుంది. వీటిని అదుపు చేసుకోవడానికి సాఫ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వేరుకుళ్లు ఆశించిన నేలల్లో సీవోసీ 3 గ్రాములు లేదా కార్బండజిమ్ 1 గ్రాములు లీటరు నీటికి కలిపి మొదళ్లలోపోయాలి. మిరపలో నేరుగా విత్తిన పంట(సాలు తోటలు) 15–20 రోజుల దశలో కలుపు సమస్య ఉంది. కొన్ని చోట్ల నీళ్లు నిలిచి ఉన్నాయి. ఇలాంటి తోటల్లో క్విజలోఫాస్ ఇథైల్ 400 ఎంఎల్ ఒక ఎకరాకు పిచికారీ చేసి గడ్డిజాతి కలుపును నివారించుకోవచ్చని సూచించారు.

మహిళల సమస్యలపై దృష్టి సారించండి



మహిళా పోలీసులతో మాట్లాడుతున్న ఎస్ఐ సునీల్‌కుమార్

ఓర్వకల్లు: గ్రామాల్లో మహిళలు ఎదుర్కుంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు పరిష్కార చర్యలు తీసుకోవాలని ఎస్ఐ సునీల్‌కుమార్ మహిళా పోలీసులకు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం సచివాలయ మహిళా పోలీసులతో ఎస్ఐ సమావేశమయ్యారు. మండలంలో ఎంత మంది మహిళా పోలీసులు ఉన్నారు, ఆయా గ్రామాల్లో పరిస్థితులు తదితర విషయాలపై ఎస్ఐ ఆరాతీశారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తేవాలని సూచించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ మహిళల సమస్యలను గుర్తించి స్థానికంగానే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే తమకు తెలియజేయాలని పేర్కొన్నారు.



హంద్రీకి... నీరు

కల్లూరు: కొన్ని రోజులుగా ఎడారిని తలపించిన హంద్రీలో నీరు ప్రవహిస్తుంది. కొన్ని రోజులుగా ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో నీరు హంద్రీ నదిలోకి వస్తుంది. కల్లూరు మండలం రెమదూరు, పుసులూరు, బొల్లవరం, బస్తిపాడు, పెద్దటేకూరు, లక్ష్మీపురం గ్రామాల సమీపంలోని హంద్రీ నదిలో నీరు ప్రవహిస్తుంది. హంద్రీ నదిలో బోర్లకు నీరు పుష్కలంగా ఉంటుందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఏఎస్ఐ బదిలీ

కర్నూలు: కర్నూలు మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్ఐ కృష్ణమోహన్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఎస్పీ బిందుమాధవ్ ఉత్తర్వులు జారీ చేశారు. పాలనాపరమైన సౌలభ్యంలో భాగంగా కృష్ణమోహన్ రెడ్డిని చిప్పగిరి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

కర్నూలు (టౌన్): మానసిక ఆరోగ్యానికి క్రీడలు అవసరమని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్, సీనియర్ స్థాయి విభాగాల్లో క్రీడాపోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. ఉషూ మార్షల్‌ఆర్ట్స్ వంటి క్రీడలు ఆత్మరక్షణకు ఉపయోగపడతాయన్నారు. ఉషూ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ పోటీలకు 60 మంది చిన్నారులు పాల్గొన్నారన్నారు. 8 ఈవెంట్లలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మసీదు స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని సర్వే నంబర్ 154లోని బుడాన్‌ఖాన్ మసీదు స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అబ్దుల్ సుభాన్, మసీదు కమిటీ కార్యదర్శి మునీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వక్ఫ్ బోర్డు జిల్లా కార్యాలయం ఎదుట ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

కలెక్టర్‌ను కలసిన ఐఏఎస్ అధికారి

కర్నూలు(సెంట్రల్): జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను అగ్రికల్చర్ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్, రైతు బజార్ సీఈఓ ఎం.విజయసునీత మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె బుధవారం కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను క్యాంపు కార్యాలయంలో కలసి పుష్పగుచ్ఛం అందజేసి జిల్లాలో మార్కెట్ల పరిస్థితిపై చర్చించారు

కోడుమూరు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



కోడుమూరు స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు: కోడుమూరు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ బిందు మాధవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోనెగండ్ల మండలం గాజులదిన్నె ప్రాజెక్టు సందర్శనకు వెళ్లిన ఎస్పీ తిరుగు ప్రయాణంలో బుధవారం సాయంత్రం కోడుమూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ సిబ్బంది పనితీరు గురించి అక్కడ ఉన్న ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో నమోదైన గ్రేవ్ కేసుల గురించి ఆరా తీసి ఏయే కేసులు ఏ కోర్టు పరిధిలో విచారణ జరుగుతున్నాయని ఆరా తీశారు. రికార్డులను పరిశీలించి మహిళా నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్ఐ శ్రీనివాసులుకు సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కేసుల తీవ్రత మేరకు త్వరితగతిన పరిష్కారం జరిగేలా చూడాలన్నారు. కేసుల విచారణకు చేపట్టాల్సిన తీరుపై దిశా నిర్దేశం చేశారు. బాధితులు పోలీసులను ఆశ్రయించినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. వెంటఎస్‌బీ సీఐ ప్రసాద్ ఉన్నారు.

పోలీసుల అదుపులో మాలమహానాడు నాయకులు

కోడుమూరు రూరల్: మాలమహానాడు నాయకులను బుధవారం కోడుమూరు పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై కోర్టు తీర్పును నిరసిస్తూ మాల మహానాడు నాయకులు భారత్ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా మాలమహానాడు జిల్లా కార్యద ర్శి మునిస్వామి, స్థానిక నాయకులు రామక్రిష్ణ, మ ద్దిలేటి, రవికుమార్, దాసు, మల్లికార్జునలను ఉదయాన్నే కోడుమూరు పోలీసులు అదుపులోకి తీసు కుని స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం సొంత పూచికత్తుపై వారిని పోలీసులు పంపించారు. మునిస్వామి మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ వర్గీకరణపై సు ప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును విరమించుకోవాలన్నారు.

రేపు మాజీ సైనికుల సమావేశం

కర్నూలు(అర్బన్): మద్రాసు రెజిమెంట్‌కు సంబంధించిన మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎస్ఆర్ రత్నరూత్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే సమస్యలను పరిష్కరించుకునేందుకు పెన్షన్ పేమెంట్ ఆర్డర్, డిశ్చార్జి బుక్, అప్డేట్ బ్యాంకు పెన్షన్ పాసుబుక్‌తో పాటు అవసరమైన ధృవపత్రాలతో స్వయంగా హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మద్రాసు రెజిమెంట్ మాజీ సైనికులు ఉపయోగించుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం కార్యాలయ పనివేళల్లో 08518–229445 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన ముగ్గురి అరెస్ట్



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

కర్నూలు: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిన ముగ్గురు వ్యక్తులను కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు అరెస్టు చేసి కటకటాల్లోకి పంపారు. కర్నూలు మండలం బాలాజీ నగర్‌లో నివాసముంటున్న షేక్ జహీర్‌బాషా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ గ్రేడ్-3 ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అదే కాలనీలో నివాసముంటున్న తన చెల్లెలు షేక్ అయేషాబాను, ఆమె భర్త షేక్ మహమ్మద్ జాకీర్ కలిసి సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో నిరుద్యోగులకు వల వేసి డబ్బులు వసూలు చేశారు. స్థానిక రామచంద్రా నగర్‌కు చెందిన నిరుద్యోగి షేక్ అబ్దుల్లా నుంచి రూ.2.08 లక్షలు, అలాగే నగరంలోని మరికొంతమంది నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థకు చెందిన నకిలీ సీల్స్, లెటర్ ప్యాడ్‌లు, రాజముద్రలు తయారు చేసి డబ్బులు ఇచ్చిన వారికి అపాయింట్‌మెంట్ ఆర్డర్ కూడా ఇచ్చారు. వారికి అనుమానం రాకుండా కొంత కాలం వర్క్ ఫ్రం హోం పేరుతో వారికి టాస్క్ ఇచ్చి పనిచేయించారు. ఇందుకోసం కొన్ని నెలలు జీతాలు ఇచ్చి వారికి నమ్మకం కలిగించి తర్వాత మరింత మంది నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేశారు. బాధితులకు అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి బుధవారం మధ్యాహ్నం ముగ్గురిని బాలాజీ నగర్‌లో అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు.

సీ.క్యాంపు రైతుబజారును అభివృద్ధి చేస్తాం



సీ.క్యాంపు రైతుబజారును పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని సీ.క్యాంపు రైతు బజారును సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత తెలిపారు. బుధవారం కర్నూలుకు వచ్చిన ఆమె సాయంత్రం సి.క్యాంపు రైతుబజారును సందర్శించారు. రైతులు, వినియోగదారులు, పొదుపు మహిళలతో వివిధ అంశాలపై చర్చించారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఉల్లితో సహా ఏపీ కూరగాయల ధరలు ఏ విధంగా ఉన్నాయని ఆరా తీశారు. రైతులు, వినియోగదారుల తాకిడి ఎక్కువగా ఉన్నందున రైతుబజారును మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. విస్తరణకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. షాపులకు స్లాబ్, షెడ్లకు షీట్లు వేయాలని సూచించారు. ఇందువల్ల ఖర్చును తగ్గించుకోవచ్చని వివరించారు. రైతుబజారులో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని, సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. లైటింగ్ బాగా ఉండేలా చూసుకోవాలన్నారు. రైతుబజారు బయట అనధికారికంగా ఉన్న కూరగాయల వ్యాపారాలను తొలగించాలని పలువురు కోరారు. దీనిపై డైరెక్టర్ స్పందిస్తూ మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళతామన్నారు. మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డీడీ శ్రీకాంత్‌రెడ్డి, ఏడీ నారాయణమూర్తి, ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను డైరెక్టర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

బలిజ సంఘం నూతన కార్యవర్గం



ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న బలిజలు

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయ ఆవరణలో బలిజ సంఘం పాణ్యం మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండజూటూరు గ్రామానికి చెందిన సిద్ధం గంగనారాయణ, ఉపాధ్యక్షుడిగా గోనవరం గ్రామానికి చెందిన ఉప్పు విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శిగా పాణ్యం గ్రామానికి చెందిన పగిడి బాలకృష్ణుడు, జాయింట్ సెక్రటరీగా భూపన్‌పాడు గ్రామానికి చెందిన బండి మనోహర్, ట్రెజరర్‌గా మాదాసు కృష్ణమోహన్ సహా కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గంగ నారాయణ మాట్లాడుతూ.. మండలంలో కార్తీక వన భోజనం, శ్రీకృష్ణదేవరాయల జయంతిని విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు.